
జ్ఞాన యోగం

# తత్వబోధ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ఆర్కైవ్ వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ఆర్కైవ్ వారి వెబ్ సైట్: https://archive.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో ఆర్కైవ్ వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul    Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## ఆర్కైవ్ వారి వెబ్ సైట్:

## https://archive.org/



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# త త్త్వ బో ధ

శ్లో॥ వాసుదేవేంద్ర యోగీంద్రం నత్వా జ్ఞానప్రదం గురుమ్ ।

ముముక్షూణాం హితార్థాయ తత్త్వబోధో భిధీయతే ॥

తా : జ్ఞానదాత, యోగీంద్రుడు, సద్గురువు నగు వాసుదేవేంద్రుని నమస్కరించి ముముక్షువుల హితార్థమై 'తత్త్వబోధ' చెప్పఁబడుచున్నది.

మూ : సాధన చతుష్టయ సంపన్నాధికారిణామ్ మోక్షసాధన భూతం తత్త్వవివేక ప్రకారం వక్ష్యామః ।

తా : సాధన చతుష్టయసంపన్నులకు మోక్ష సాధన భూత మగు తత్త్వవివేకమును బోధించుచున్నాము.

మూ : ప్రశ్న - సాధన చతుష్టయం కిమ్ ?

సాధన చతుష్టయ మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - నిత్యానిత్య వివేక, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగః, శమాదిషట్క సంపత్తి, ర్ముముక్షుత్వం చేతి ।

తా : 1) నిత్యానిత్య వస్తు వివేకము 2. ఇహాముత్రఫల భోగ విరాగము 3. శమాది షట్క సంపత్తి 4. ముముక్షుత్వము - ఈ నాల్గింటికి సాధన చతుష్టయ మని పేరు.

మూ. ప్రశ్న - నిత్యానిత్య వస్తు వివేకః కః ?

తా : నిత్యా నిత్య వస్తు వివేక మనఁగా నేమి ?

ఉత్తరము : నిత్యవస్త్వేకమ్ బ్రహ్మ । తద్వ్యతిరిక్తం సర్వ మనిత్యమ్ ।

అయ మేవ నిత్యానిత్య వస్తు వివేకః ॥

బ్రహ్మ మొక్కటే నిత్యమైన వస్తువు. బ్రహ్మము కంటె నితరమైన దంతయు ననిత్యము. దీనికే నిత్యానిత్య వస్తు వివేక మని పేరు.

మూ : ప్రశ్న - విరాగః కః ?

తా : విరాగ మనఁగా నేమి ?

ఉత్తరము : ఇహ స్వర్గభోగే ష్విచ్ఛారాహిత్యమ్ ।

తా : ఈ లోకమునందుఁ గాని, స్వర్గాది లోకములందుఁ గాని భోగములు పొందవలెననెడి కోరిక లేకుండుట విరాగము.

మూ : ప్రశ్న - శమాదిసాధన సంపత్తిః కా ?

తా : శమాదిసాధన సంపత్తి యనఁగా నేమి ?

మూ : ఉత్తరము - శమో దమ ఉపరమ స్తితిక్షా శ్రద్ధా సమాధానం చేతి ।

1) శమము 2) దమము 3) ఉపరమము 4) తితిక్ష 5) శ్రద్ధ 6) సమాధానము - ఈ యాఱింటికి శమాది సాధన సంపత్తి అని పేరు.

మూ : ప్రశ్న - శమః కః ?

తా : శమ మనఁగా నేమి ?

మూ : ఉత్తరము : మనో నిగ్రహః ।

తా : మనోనిగ్రహము శమము.

మూ : ప్రశ్న - దమః కః ?

తా : దమ మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - చక్షురాది బాహ్యేంద్రియ నిగ్రహః ।

తా : కన్ను మొదలగు బాహ్యేంద్రియముల నిగ్రహము దమము.

మూ : ప్రశ్న - ఉపరమః కః ?

తా : ఉపరమ మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - స్వధర్మానుష్ఠాన మేవ ।

తా : స్వధర్మాచరణము యుపరమము.

మూ : ప్రశ్న - తితిక్షా కా ?

తా : తితిక్ష యనఁగా నేమి ?

మూ : ఉత్తరము - శీతోష్ణ సుఖ దుఃఖాది సహిష్ణుత్వమ్ ।

తా : చలి - వేఁడి, సుఖము - దుఃఖము మొదలగు ద్వంద్వములను సహించుటయే తితిక్ష.

మూ : ప్రశ్న - శ్రద్ధా కీదృశీ ?

తా : శ్రద్ధ యనఁగా నేమి ?

మూ : ఉత్తరము - గురు వేదాంతవాక్యాదిషు విశ్వాసః శ్రద్ధా ।

తా : గురువాక్యములయందు, వేదాంత వాక్యముల యందు అత్యంత నమ్మకము కలిగియుండుట శ్రద్ధ.

మూ : ప్రశ్న - సమాధానం కిమ్ ?

తా : సమాధాన మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - చిత్తైకాగ్రతా ?

తా : చిత్తము యొక్క యేకాగ్రతయే సమాధానము.

మూ : ప్రశ్న - ముముక్షుత్వం కిమ్ ?

తా : ముముక్షుత్వ మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - మోక్షమ్ మే భూయాదితీచ్ఛా ।

తా : నాకు మోక్షము కలుగుఁగాక ! యనెడి కోరికయే ముముక్షుత్వము.

మూ : ఉత్తరము - ఏతత్ సాధన చతుష్టయమ్ ।

తా : ఇదియే సాధన చతుష్టయము.

మూ : ఉత్తరము - తత స్తత్త్వవివేక స్యాధికారిణో భవంతి ।

తా : సాధన చతుష్టయసంపన్నులు తత్త్వవివేకమున కధికారు లగుచున్నారు.

మూ : ప్రశ్న - తత్త్వ వివేకః కః ?

తా : తత్త్వవివేక మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - ఆత్మా సత్యస్తదన్యత్ సర్వమ్ మిథ్యేతి ।

తా : ఆత్మ యొక్కటియే సత్యమైనది. ఆత్మకంటె యితరమైన దంతయు మిథ్య యను వివేచనమే తత్త్వవివేకము.

మూ : ప్రశ్న - ఆత్మా కః ?

తా : ఆత్మ యనఁగా నేమి ?

మూ : ఉత్తరము - స్థూల సూక్ష్మ కారణ శరీరాద్ వ్యతిరిక్తః
పంచకోశాతీత స్స న్నవస్థా త్రయసాక్షీ సచ్చిదానంద
స్వరూపః సన్ య స్తిష్ఠతి స ఆత్మా ।

తా : 1) స్థూల శరీరము 2) సూక్ష్మ శరీరము 3) కారణ శరీరము నను మూఁడింటి కంటె భిన్నమైనది, పంచకోశములకు నతీతమైనది, యవస్థాత్రయమునకు సాక్షియైనది, సచ్చిదానంద స్వరూప మైనదిగా నేది యున్నదో యదియే యాత్మ.

మూ : ప్రశ్న - స్థూల శరీరం కిమ్ ?

తా : స్థూల శరీర మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - పంచీకృత పంచమహాభూతైః కృతం,

సత్కర్మజన్యం సుఖదుఃఖాదిభోగాయతనం శరీరమ్ । అస్తి జాయతే వర్ధతే విపరిణమతే పక్షీయతే వినశ్యతీతి షడ్వికారవత్ । ఏతత్ స్థూల శరీరమ్ ॥

తా : పంచీకృతము లగు పంచమహాభూతములచేఁ జేయఁబడినది, సత్కర్మముల వలనఁ బుట్టినది, సుఖము దుఃఖము మొదలగు భోగములకు స్థాన మైనది శరీరము ఉన్నది, పుట్టుచున్నది, పెరుగుచున్నది, మార్పు నొందుచున్నది, క్షీణించుచున్నది, నశించుచున్నది యను నాఱు వికారములు కల్గినది స్థూలశరీరము.

మూ : ప్రశ్న - సూక్ష్మ శరీరం కిమ్ ?

తా : సూక్ష్మ శరీర మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - అపంచీకృత సూక్ష్మమహాభూతైః కృతం సత్కర్మ జన్యం సుఖదుఃఖాది భోగసాధనమ్, జ్ఞానేంద్రియాణి, పంచకర్మేంద్రియాణి పంచ ప్రాణాదయో మనశ్చైకమ్ బుద్ధిశ్చైకా - ఏవం సప్త దశకలాభిః సహ యత్ తిష్ఠతి తత్ సూక్ష్మ శరీరమ్ ।

తా : పంచీకృతములు కాని పంచసూక్ష్మభూతములచే నేర్పడునది, పూర్వజన్మ పుణ్యమునఁ గల్గునది, సుఖము దుఃఖము మొదలగు భోగములకు సాధన మైనది, యైదు జ్ఞానేంద్రియములు, నైదు కర్మేంద్రియములు, నైదు ప్రాణాదులు, మనస్సు బుద్ధి యను పదునేడు కళలతోఁ గూడినది సూక్ష్మ శరీరము.

మూ : శ్రోత్రం త్వక్ చక్షూ రసనా ఘ్రాణ మితి పంచ జ్ఞానేంద్రియాణి ।

తా : 1) చెవులు 2) చర్మము 3) కన్నులు 4) నాలుక

5) ముక్కు నను నైదును జ్ఞానేంద్రియములు.

మూ : శ్రోత్రస్య దిగ్దేవతా । త్వచో వాయుః । చక్షుషః సూర్యః । రసనాయా వరుణః । ఘ్రాణ స్యాశ్వినౌ । ఇతి జ్ఞానేంద్రియ దేవతాః ॥

తా : చెవులకు దిక్కు , చర్మమునకు వాయువు, కన్నులకు సూర్యుఁడు, నాలుకకు వరుణుఁడు, ముక్కునకశ్వినీ దేవతలు నధిష్ఠాన దేవతలు.

మూ : శ్రోత్రస్య విషయః శబ్దగ్రహణమ్ । త్వచో విషయః స్పర్శగ్రహణమ్ ।
చక్షుషో విషయో రూపగ్రహణమ్ । రసనాయా విషయో రస
గ్రహణమ్ । ఘ్రాణస్య విషయో గంధ గ్రహణ మితి ॥

తా : చెవులకు శబ్దమును వినుట, చర్మమునకు స్పర్శమును గ్రహించుట, కన్నులకు రూపమును చూచుట, నాలుకకు రుచిని గ్రహించుట, ముక్కునకు గంధము వాసనను పీల్చుచుట కార్యములు.

మూ : వాక్పాణి పాద పాయూపస్థానీతి పంచ కర్మేంద్రియాణి ।

తా : వాక్కు (మాట్లాడునింద్రియము), పాణి (చేతులు), పాదములు (కాళ్ళు), పాయువు (గుదము), ఉపస్థము (జననేంద్రియము) నను నైదును గర్మేంద్రియములు.

మూ : వాచో దేవతా వహ్నిః । హస్తయో రింద్రః । పాదయో ర్విష్ణుః । పాయో ర్మృత్యుః । ఉపస్థస్య ప్రజాపతిః । ఇతి కర్మేంద్రియ దేవతాః॥

తా : వాక్కున కగ్ని, చేతుల కింద్రుఁడు, పాదములకు విష్ణువు, గుదమునకు మృత్యువు, జననేంద్రియమునకుఁబ్రహ్మ యధిష్టానదేవతలు.

మూ : వాచో విషయో భాషణమ్ । పాణ్యో ర్విషయో వస్తుగ్రహణమ్ ।

పాదయో ర్విషయో గమనమ్ । పాయో ర్విషయో మలత్యాగః ।

ఉపస్థస్య విషయ ఆనంద ఇతి ॥

తా : వాక్కునకు మాట్లాడుట, చేతులకు వస్తువులను గ్రహించుట, పాదములకు నడచుట, పాయువునకు మలమును విసర్జించుట, యుపస్థమునకు సంభోగానందము ననుభవించుట కార్యములు.

మూ : ప్రశ్న : కారణ శరీరం కిమ్ ?

తా : కారణ శరీర మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - అనిర్వాచ్యానా ద్యవిద్యారూపం శరీర ద్వయస్య

కారణమాత్రం సత్ స్వరూపాజ్ఞానం నిర్వికల్పక రూపం

యదస్తి తత్ కారణ శరీరమ్ ।

తా : నిర్వచించుటకు వీలుకానిది, యనాది యైన యవిద్యకు (అజ్ఞానమునకు) కారణమైనది, స్థూల సూక్ష్మ శరీరములకుఁ గారణమైనది, స్వరూప జ్ఞానము లేనిది, నిర్వికల్పక రూపమైనది కారణ శరీరము.

మూ : ప్రశ్న - అవస్థాత్రయం కిమ్ ?

తా : అవస్థాత్రయ మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్థాః ।

తా : జాగ్రదవస్థ (మెలఁకువగానుండుట), స్వప్నావస్థ (కలలు గాంచుట), సుషుప్త్యవస్థ (నిద్రించుట) యను మూఁడవస్థలకు నవస్థాత్రయ మని పేరు.

మూ : ప్రశ్న । జాగ్రదవస్థా కా ?

తా : జాగ్రదవస్థ యనఁగా నేమి ?

మూ : ఉత్తరము - శ్రోత్రాది జ్ఞానేంద్రియైః శబ్దాది విషయైశ్చ జ్ఞాయత ఇతి యత్ సా జాగ్రదవస్థా ।

తా : చెవులు - చర్మము - కన్నులు - నాలుక - ముక్కు నను నైదు జ్ఞానేంద్రియములచేతను, శబ్దము - స్పర్శము - రూపము - రసము - గంధము నను నైదు విషయములను దెలియఁజేయునది జాగ్రదవస్థ.

మూ : స్థూల శరీరాభిమాన్యాత్మా విశ్వ ఇత్యుచ్యతే ।

తా : స్థూల శరీరాభిమాని యగు నాత్మ విశ్వుఁడని చెప్పఁబడును.

మూ : ప్రశ్న - స్వప్నావస్థా కా ?

తా : స్వప్నావస్థ యనఁగా నేమి ?

మూ : ఉత్తరము - స్వప్నావస్థా కేతి చే జ్జాగ్ర దవస్థాయాం యద్దృష్టం యచ్ఛ్రుతం తజ్జనిత వాసనయా నిద్రాసమయే యత్ప్రపంచః ప్రతీయతే సా స్వప్నావస్థా ।

తా : జాగ్రదవస్థలోఁ జూడఁబడినది, వినఁబడినది యేది గలదో దాని వలన ( బుట్టిన సంస్కారముచే నిద్రా సమయములో నే ప్రపంచము కనబడుచున్నదో దానికి స్వప్నావస్థ యని పేరు.

మూ : సూక్ష్మ శరీరాభిమా న్యాత్మా తైజస ఇత్యుచ్యతే ।

తా : సూక్ష్మ శరీరాభిమాని యగు నాత్మ తైజసుఁడని చెప్పఁబడును.

మూ : ప్రశ్న - తతః సుషుప్త్యవస్థ యనఁగా నేమి ?

తా : పిమ్మట సుషుప్త్యవస్థ యనఁగా నేమి ?

మూ : ఉత్తరము - అహం కిమపి న జానామి సుఖేన మయా

నిద్రానుభూయతత ఇతి సుషుప్త్యవస్థా ।

తా : నా కేమియును దెలియదు. నేను సుఖముగా నిద్రించుచున్నా ననునది సుషుప్త్యవస్త (నిద్రావస్థ).

మూ : కారణ శరీరాభిమా న్యాత్మా ప్రాజ్ఞ ఇత్యుచ్యతే ।

తా : కారణ శరీరాభిమాని యగు నాత్మ ప్రాజ్ఞుఁడని చెప్పఁబడును.

మూ : ప్రశ్న : పంచకోశాః కే ?

తా : పంచకోశము లనఁగా నేవి ?

మూ : ఉత్తరము : అన్నమయః ప్రాణమయో మనోమయో

విజ్ఞానమయ ఆనందమయ శ్చేతి ।

1) అన్నమయము 2) ప్రాణమయము 3) మనోమయము 4) విజ్ఞానమయము 5) ఆనందమయము నను నవి పంచకోశములు.

మూ : ప్రశ్న - అన్నమయః కః ?

తా : అన్నమయ కోశ మనఁగా నేది ?

మూ : ఉత్తరము - అన్నరసేనైవ భూత్వా న్నరసేనైవ వృద్ధిమ్

ప్రాప్యాన్న రూపపృథివ్యాం య ద్విలీయతే తదన్నమయః

కోశః స్థూల శరీరమ్ ।

తా : అన్నరసముచేఁ బుట్టి, యన్నరసముచే వృద్ధి చెంది, యన్నరూపపృథివి యందు విలీన మగునది యన్నమయ కోశము. ఇదియే స్థూల శరీరము.

మూ : ప్రశ్న - ప్రాణమయః కః ?

తా : ప్రాణమయ కోశ మనఁగా నేది ?

మూ :  ఉత్తరము - ప్రాణాద్యాః పంచవాయవో వాగాదీంద్రియ

పంచకమ్ ప్రాణమయః కోశః ।

1) ప్రాణము  2) అపానము  3) వ్యానము  4) ఉదానము

5) సమానము  నను పంచవాయువులతో  1) వాక్కు  2) పాణి

3) పాదము  4) పాయువు  5) ఉపస్థము నను పంచ కర్మేంద్రి

యములతోఁ గూడినది ప్రాణమయకోశము.

మూ : ప్రశ్న - మనోమయః కః ?

తా : మనోమయకోశ మనఁగా నేది ?

మూ : ఉత్తరము - మనశ్చ జ్ఞానేంద్రియ పంచకమ్ మిలిత్వా యెూ భవతి స మనోమయః కోశః ।

తా :  పంచ జ్ఞానేంద్రియములతోఁ గూడిన మనస్సు మనోమయకోశము.

మూ : ప్రశ్న - విజ్ఞానమయః కః ?

తా : విజ్ఞానమయ కోశ మనఁగా నేది ?

మూ : ఉత్తరము -బుద్ధిః జ్ఞానేంద్రియ పంచకమ్ మిలిత్వా యెూ భవతి స విజ్ఞానమయః కోశః ।

తా : పంచ జ్ఞానేంద్రియములతోఁ గూడిన బుద్ధి విజ్ఞానమయ కోశము.

మూ : ప్రశ్న - ఆనందమయః కః ?

తా: ఆనందమయకోశ మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - ఏవమేవ కారణ శరీరభూత మవిద్యాస్థ మలిన సత్త్వం ప్రియాది వృత్తి సహితం సత్ ఆనందమయః కోశః ।

తా : ఈ విధముగా నవిద్యతో మలిన సత్త్వమై ప్రియాదివృత్తితోఁ గూడి యానందముతో నిండిన కారణ శరీర మానందమయ కోశము.

మూ : ఏతత్ కోశపంచకమ్ ।

తా : దీనికే కోశ పంచక మని పేరు.

మూ : మదీయం శరీరం, మదీయాః ప్రాణా మదీయమ్ మనశ్చ మదీయమ్ బుద్ధి ర్మదీయం జ్ఞాన మితి స్వేనైవ జ్ఞాయతే । తద్యథా మదీయత్వేన జ్ఞాతం కటక కుండల గృహాదికం స్వస్మాద్భిన్నమ్ మదీయత్వేన జ్ఞాత మాత్మా న భవతి ।

తా : ఈ శరీరము నాది, యీ ప్రాణములు నావి, యీ మనస్సు నాది, యీ బుద్ధి నాది, యీ జ్ఞానము నాది, యను ననుభవముతో శరీరాదులు తనకంటె భిన్నమైన వని తన చేతనే తెలియఁబడు చున్నవి. ఎట్లనఁగా నీ కంకణములు నావి, యీ కుండలములు నావి, యీ యిల్లు నాది యనుచోటఁ గంకణాదులు తనకంటె నెట్లు భిన్నమైనవో యట్లే శరీరాదులు కూడఁ దనకంటె భిన్నమైనవి. లోకములో సామాన్య జనుఁడు కూడ నీ దేహము నాది యని తలంచుచున్నాఁడు. కాని నేనే దేహమని భావించుట లేదు. కావున నీ పంచకోశములు నాత్మకావు.

ప్రశ్న : ఆత్మా తర్హి కః ?

తా : అయినచో నాత్మ యనఁగా నేది ?

మూ : ఉత్తరము - సచ్చిదానంద స్వరూపః ।

తా : సచ్చిదానంద స్వరూపమే యాత్మ.

మూ : ప్రశ్న - సత్ కిమ్ ?

తా : సత్తనఁగా నేమి ?

మూ :  ఉత్తరము - కాలత్రయే పి తిష్ఠతీతి సత్ ।

భూత (జరిగినది) భవిష్యద్ (జరుగఁబోవునది) వర్తమాన (జరుగుచున్నది) ములను మూఁడు కాలములందు నేది యుండునో యది సత్తగును.

మూ : ప్రశ్న :  చిత్ కిమ్ ?

తా : చిత్తనఁగా నేమి ?

మూ : ఉత్తరము - జ్ఞాన స్వరూపః ।

తా : జ్ఞాన స్వరూపమైనది చిత్తగును.

మూ: ప్రశ్న - ఆనందః కః ?

తా : ఆనంద మనఁగా నేమి ?

మూ : ఉత్తరము - సుఖస్వరూపః ।

తా : సుఖ స్వరూపమే యానందము.

మూ : ఏవం సచ్చిదానంద స్వరూపం స్వాత్మానం విజానీయాత్ ।

తా : ఇట్టి సచ్చిదానంద స్వరూప మైన తన యాత్మను దెలిసికొనవలెను.

మూ : అథ చతుర్వింశతి తత్త్వోత్పత్తి ప్రకారం వక్ష్యామః ।

తా : ఇంక నిరువదినాలుగు తత్త్వముల పుట్టుకను గూర్చి చెప్పుచున్నాము.

మూ : బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమో గుణాత్మికా మాయా స్తి ।

తా : సత్త్వము - రజస్సు - తమస్సు నను మూఁడు గుణములతో బ్రహ్మము నాశ్రయించిన మాయ గలదు.

మూ : తత ఆకాశః సంభూతః ।

తా : ఆ మాయ నుండి యాకాశము పుట్టినది.

మూ : ఆకాశా ద్వాయుః ।

తా : ఆకాశము నుండి వాయువు (గాలి) పుట్టినది.

మూ : వాయో స్తేజః ।

తా : ఆ వాయువు నుండి తేజస్సు (అగ్ని) పుట్టినది.

మూ : తేజస ఆపః

తా : అగ్ని నుండి నీరు పుట్టినది.

మూ : అద్భ్యః పృథివీ ।

తా : నీటి నుండి భూమి పుట్టినది.

మూ : ఏతేషామ్ పంచ తత్త్వానామ్ మధ్య ఆకాశస్య సాత్త్వికాంశాత్ శ్రోత్రేంద్రియం సంభూతమ్ ।

తా : ఈ పంచభూతములలో నాకాశము యొక్క సాత్త్వికాంశమువలన శ్రోత్రేంద్రియము (చెవి) పుట్టినది.

మూ : వాయోః సాత్త్వికాంశాత్ త్వగింద్రియం సంభూతమ్ ।

తా : వాయువు యొక్క సాత్త్వికాంశము నుండి త్వగింద్రియము (చర్మము) పుట్టినది.

మూ : అగ్నేః సాత్త్వికాంశాత్ చక్షురింద్రియం సంభూతమ్ ।

తా : అగ్నియొక్క సాత్త్వికాంశము నుండి చక్షురింద్రియము (కన్ను)పుట్టినది.

మూ : జలస్య సాత్త్వికాంశా ద్రసనేంద్రియం సంభూతమ్ ।

తా : జలము యొక్క సాత్త్వికాంశము వలన రసనేంద్రియము (నాలుక) పుట్టినది.

మూ : పృథివ్యాః  సాత్త్వికాంశాద్ ఘ్రాణేంద్రియం సంభూతమ్ ।

తా : భూమి యొక్క సాత్త్వికాంశము వలన ఘ్రాణేంద్రియము (ముక్కు) పుట్టినది.

మూ : ఏతేషామ్ పంచతత్త్వానాం సమష్ఠి సాత్త్వికాంశా న్మనో బుద్ధ్యహంకార చిత్తాంతః కరణాని సంభూతాని।

తా : ఈ పంచభూతముల సమష్టి సాత్త్వికాంశముల వలన

1) మనస్సు 2) బుద్ధి 3) అహంకారము 4) చిత్తములను నంతః కరణములేర్పడినవి.

మూ : సంకల్ప వికల్పాత్మకమ్ మనః ।

తా : సంకల్ప వికల్పములతోఁ గూడినది మనస్సు.

మూ : నిశ్చయాత్మికా బుద్ధిః ।

తా : నిశ్చయాత్మకమైనది బుద్ధి, సంశయమునకు హేతువు మన స్సనియు నిశ్చయమునకు హేతువు బుద్ధి యనియు గ్రహింపవలెను.

మూ : అహంకర్తాహంకారః ।

తా : నేనే కర్త ననెడి భావన యహంకారము.

మూ : చింతన కర్తృ చిత్తమ్ ।

తా : చింతన చేయునది చిత్తము. ఈ మనోబుద్ధ్యహంకార చిత్తముల కంతఃకరణ చతుష్టయ మని పేరు.

మూ : మనసో దేవతా చంద్రమాః । బుద్ధే ర్బ్రహ్మా । అహంకారస్య రుద్రః । చిత్తస్య వాసుదేవః ।

తా : మనస్సునకుఁ జంద్రుఁడు, బుద్ధికి బ్రహ్మ, యహంకారమునకు రుద్రుఁడు (శివుఁడు), చిత్తమునకు వాసుదేవుఁడు (విష్ణువు) నధి దేవతలు.

మూ : ఏతేషామ్ పంచతత్త్వానామ్ మధ్య ఆకాశస్య రాజసాంశాద్సస

వాగింద్రియం సంభూతమ్.

తా : ఈ పంచభూతములలో నాకాశము యొక్క రాజసాంశము వలన వాగింద్రియము పుట్టినది.

మూ : వాయో రాజసాంశాత్ పాణీంద్రియం సంభూతమ్ ।

తా : వాయువు యొక్క రాజసాంశము నుండి పాణీంద్రియము (చేయి) పుట్టినది.

మూ : వహ్నే రాజసాంశాత్ పాదేంద్రియం సంభూతమ్ ।

తా : అగ్నియొక్క రాజసాంశము నుండి పాదము (కాలు) పుట్టినది.

మూ : జలస్య రాజసాంశాద్ ఉపస్థేంద్రియం సంభూతమ్ ।

తా : నీటియొక్క రాజసాంశము వలన ఉపస్థేంద్రియము (జననేంద్రియము) పుట్టినది.

మూ : పృథివ్యా రాజసాంశాద్ గుదేంద్రియం సంభూతమ్ ।

తా :భూమియొక్క రాజసాంశము వలన గుదేంద్రియము (జననేంద్రియము) పుట్టినది.

మూ : ఏతేషాం సమష్టిరాజ సాంశాత్ పంచప్రాణాః

సంభూతాః ।

తా : ఈ పంచభూతముల సమష్టి రాజసాంశము వలనఁ

బ్రాణాపానవ్యానోదాన సమానము లను పంచప్రాణములు పుట్టినవి. నాభి నుండి నాసిక వఱకు సంచరించు వాయువు ప్రాణము. నాభి నుండి గుదము వఱకు సంచరించు వాయువపానము. దేహమునందంతట సంచరించు వాయువు వ్యానము. కంఠము నందలి వాయు వుదానము. నాభి మండల మునం దుండు వాయువు సమానము.

మూ : ఏతేషాం పంచతత్త్వానాం తామసాంశాత్ పంచీకృత పంచతత్త్వాని భవంతి

తా : ఈ పంచ భూతముల యొక్క తామసాంశము వలన ( బంచీకరణము చెందిన పంచ మహాభూతములు పుట్టుచున్నవి.

మూ : పంచీకరణం కథ మిత చేత్ ? ఏతేషామ్ పంచమహా భూతానాం తామసాంశస్వరూప మేక మేకమ్ భూతం ద్విధావిభజ్య, ఏక మేక మర్ధమ్ పృథక్ తూష్ణీంవ్యవస్థాప్య, అపర మపర మర్ధం చతుర్ధా విభజ్య స్వార్ధ మన్యే ష్వర్ధేషు స్వభాగ చతుష్టయ సంయోజనం కార్యమ్ । తథా పంచీకరణమ్ భవతి ॥

తా : పంచీకరణ మెట్లు జరుగుచున్న దన్నచో( జెప్పుచున్నాము. ఈ పంచమహాభూతముల యొక్క తామసాంశస్వరూపముల నొక్కటొక్కటిగా నున్న దానిని రెండుగా విభజించి, యొక్కొక్క మహాభూతమునందున్న సగభాగముల నట్లే యుంచి, మిగిలిన సగభాగములను నాల్గు నాల్గుగా విభజించి యా నాల్గింటిని దక్కిన మహాభూతముల సగభాగములతో( గలుప వలయును. అన(గా( బ్రతిమహా భూతము నందలి సగభాగము ($\frac{1}{2}$) తక్కిన నాల్గు భూతముల యందలి $\frac{1}{8}$ వంతులతో( గలిసి పంచీకృత పంచ మహాభూతము లేర్పడుచున్నవి. దీనినే పంచీకరణ మందురు.

మూ : ఏతేభ్యః పంచీకృత పంచ మహాభూతేభ్యః స్థూల శరీరమ్ భవతి ।

తా : ఈ విధముగాఁ బంచీకరణము నొందిన పంచ మహాభూతముల వలన స్థూల శరీరము పుట్టుచున్నది.

మూ : ఏవమ్ పిండ బ్రహ్మాండయో రైక్యం సంభూతమ్ ।

ఈ విధముగాఁ బిండ - బ్రహ్మాండముల కైక్యము సిద్ధించుచున్నది.

పిండ మనఁగా జీవుని స్థూల శరీరము. సమష్టి స్థూల శరీరము లన్నియు గలిసి బ్రహ్మాండమగును.

మూ : స్థూల శరీరాభిమానీ జీవనామకమ్ బ్రహ్మప్రతిబింబమ్ భవతి । స ఏవ ప్రకృత్యా స్వస్మా దీశ్వరమ్ భిన్నత్వేన జానాతి ॥

తా : స్థూల శరీరాభిమానము గల యాత్మ జీవుఁడను పేరుతో నొప్పుచున్నది. ఆ జీవుఁడే ప్రకృతి బద్ధుఁడై తన కంటె నీశ్వరుఁడు భిన్నుఁడని తలంచుచున్నాఁడు. బింబ స్థానీయుఁడగు పరమాత్మకు జీవుడు ప్రతి బింబము వంటి వాడని భావము.

మూ : అవిద్యోపాధిః సన్నాత్మా జీవ ఇత్యుచ్యతే ।

తా : అ విద్య (అజ్ఞానము) యుపాధిగాగల యాత్మయే జీవుడని చెప్పబడుచున్నది.

మూ : మాయోపాధిః సన్నీశ్వర ఇత్యుచ్యతే ।

తా : మాయ యుపాధిగాగల యాత్మయే యీశ్వరుఁడని చెప్పబడుచున్నది. మాయచే నవచ్ఛిన్నమైన (ఆవరింపబడిన) చైతన్య మీశ్వరుడనియు, నవిద్యచే నవచ్ఛిన్నమైన (అజ్ఞానముచే నావరింపబడిన) చైతన్యము జీవుడనియు తెలుసుకొనవలెను.

మూా : ఏవ ముపాధి భేధా జ్జీవేశ్వర భేద దృష్టి ర్యావత్పర్యంతంతిష్ఠతి తావత్పర్యంతం జన్మమరణాది రూప సంసారో న నివర్తతే ।

తా : ఈ విధముగా నుపాధిభేదముచే జీవుడు నీశ్వరుడు వేరను భేద దృష్టి యెందాక నుండునో యంత వఱకు జన్మము మరణము మొదలగు రూపములో నున్న సంసారము తొలగదు.

మూా : తస్మాత్ కారణా న్న జీవేశ్వరయోః భేద బుద్ధిః స్వీకార్యా ।

తా : అందు వలన జీవుఁడు, నీశ్వరుఁడు భిన్ను లను భేదబుద్ధి స్వీకరింపదగదు. అనగా ద్వైత దృష్టియే సంసారహేతు వనియు నద్వైత దృష్టి వలన మోక్షము సిద్ధించు ననియు గ్రహింపవలెను.

మూా : నను సాహంకారస్య కించిజ్జ ్ఞ స్య జీవస్య నిరహంకారస్య

సర్వజ్ఞ స్యేశ్వరస్య తత్త్వ మసీ తి మహావాక్యాత్ కథ మభేద బుద్ధిః స్యాత్? ఉభయో ర్విరుద్ధ ధర్మాక్రాంతత్వాది తి చేన్న ।

తా : ఓయీా ! తత్త్వమసి యను మహావాక్యము జీవేశ్వరు లభిన్ను లని ప్రతిపాదించుచున్నది. జీవుఁ డహంకారము కలవాఁడు. కించిజ్ఞుఁడు.ఈశ్వరుడన్నచో నహంకారము లేని వాఁడు. సర్వజ్ఞుఁడు ఇట్టి విరుద్ధ ధర్మములు గల జీవేశ్వరుల కైక్య మెట్లు పొసఁగును ? అన్నచో నది సరిగాదు.

మూా : స్థూల సూక్ష్మ శరీరాభిమానీ 'త్వం' పద వాచ్యార్థః । ఉపాధి నిర్ముక్తం సమాధి దశాసంపన్నం శుద్ధచైతన్యం 'త్వం' పద లక్ష్యార్థః ।

తా : స్థూల సూక్ష్మ శరీరాభిమానము గల జీవునకు, 'త్వం' పదము వాచ్యార్థ మగుచున్నది. ఉపాధి నుండి విడివడి సమాధి దశతో సంపన్నమై శుద్ధచైతన్య మైన

జీవునకు 'త్వం' పదము లక్ష్యార్థ మగుచున్నది.

మూ : ఏవం సర్వజ్ఞత్వాది విశిష్ట ఈశ్వర స్తత్పద వాచ్యార్థః ।

ఉపాధి శూన్యం శుద్ధ చైతన్యం తత్పద లక్ష్యార్థః ।

తా : ఈ విధముగానే సర్వజ్ఞత్వము మొదలగు ధర్మము లతో గూడిన యీశ్వరునకు దత్పదము వాచ్యార్థ మగుచున్నఇ. ఉపాధి లేని శుద్ధ చైతన్య స్వరూపుడైన ఈశ్వరునకుఁ దత్పదము లక్ష్యార్థ మగుచున్నది.

మూ : ఏవంచ జీవేశ్వరయోః చైతన్య రూపేణా భేదే బాధకా భావః ।

తా : ఇట్లు చైతన్య స్వరూపముచే జీవునకు, నీశ్వరునకు భేదము లేదనుటలో బాధ లేదు.

మూ : ఏవంచ వేదాంతవాక్యైః సద్గురూపదేశేన చ సర్వేష్వపి భూతేషు యేషాం బ్రహ్మ బుద్ధి రుత్పన్నా తే జీవన్ముక్తా ఇత్యర్థః ।

తా : ఈ విధముగా వేదాంత వాక్యముల చేతను సద్గురూపదేశము వలనను సర్వభూతములందు నెవరికి బ్రహ్మ బుద్ధి ఉత్పన్నమగునో వారే జీవన్ముక్తు లని యర్థము.

మూ : ప్రశ్న - నను జీవన్ముక్తః కః ?

తా : జీవన్ముక్తుఁ డనఁగా నెవఁడు ?

మూ : ఉత్తరము - యథా దేహోహం పురుషోహం బ్రాహ్మణోహం శూద్రోహ మస్మీతి దృఢనిశ్చయః తథానాహం బ్రాహ్మణో న శూద్రో న పురుషః కిం త్వసంగః సచ్చిదానంద స్వరూపః ప్రకాశరూపః సర్వాంతర్యామీ చిదాకాశరూపో స్మీతి దృఢనిశ్చయ రూపో పరోక్ష జ్ఞానవాన్ జీవన్ముక్తః ।

తా : ఎట్లు నేను దేహమును, నేను పురుషుఁడను, నేను బ్రాహ్మణుఁడను, నేను శూద్రుడను నను దృఢనిశ్చయము గల్గుచున్నదో యట్లే నేను బ్రాహ్మణుఁడను గాను, శూద్రుడను గాను, పురుషుడను గాను, నేను సంగములేని వాడను, సచ్చిదానంద స్వరూపుడను, ప్రకాశరూపుడను, సర్వాంతర్యామిని, చిదాకాశరూపుఁడనై యున్నా నను దృఢ నిశ్చయ రూపమైన యపరోక్ష జ్ఞాన మెవ్వని కుండునో యతఁడే జీవన్ముక్తుఁడు.

మూ : బ్రహ్మై వాహ మస్మీత్యపరోక్ష జ్ఞానేన నిఖిల కర్మ

బంధవినిర్ముక్తః స్యాత్ ।

తా : నేనే బ్రహ్మమై యున్నా ననెడి యపరోక్ష జ్ఞానముచే జీవన్ముక్తుడు సర్వకర్మ బంధములనుండి విముక్తుడగును.

మూ : కర్మాణి కతి విధాని సంతీతి చేత్ ? ఆగామి - సంచిత -

ప్రారబ్ధ భేదేన త్రివిధాని సంతి ।

తా : కర్మము లెన్ని విధము లన్నచో నవి 1) ఆగామి 2) సంచితము 3) ప్రారబ్ధము నని మూఁడు విధములుగా నున్నవి.

మూ : జ్ఞానోత్పత్త్యనంతరం జ్ఞానిదేహ కృతం పుణ్యపాపరూపం

కర్మ యదస్తి తదాగా మీత్యభిధీయతే ।

తా : జ్ఞానము గలిగిన పిమ్మట జ్ఞాని యొక్క దేహముచేఁ జేయఁబడిన పుణ్యపాపరూప మగు కర్మ మేది గలదో యది యాగామి యని చెప్పఁబడుచున్నది.

మూ : అనంతకోటి జన్మనాం బీజ భూతం సద్ యత్కర్మజాతం

పూర్వార్జితం తిష్ఠతి తత్ సంచితం జ్ఞేయమ్ ।

తా : అనంత కోట్యుత్తర జన్మములకు బీజ భూతమై పూర్వ జన్మములం దార్జింపఁ

బడిన కర్మము సంచిత మని తెలియవలెను.

మూ : ప్రారబ్ధం కర్మ కిమితి చేత్ ? ఇదం శరీర ముత్పాద్యేహలోక

ఏవ సుఖదుఃఖాది ప్రదం యత్కర్మ తత్ ప్రారబ్ధమ్ భోగేన నష్టమ్ భవతీతి ।

తా : ప్రారబ్ధకర్మ మనగా నేమి ? ఈ దేహమును బుట్టించి యీ లోకమందే సుఖదుఃఖాదులను గలుగజేయుచు ననుభవించుట వలన నశించునది ప్రారబ్ధ కర్మము.

మూ : ప్రారబ్ధ కర్మణామ్ భోగా దేవ క్షయ ఇతి ।

తా : ప్రారబ్ధ కర్మము లనుభవించుట వల్లనే క్షయ మగును.

మూ : సంచితం కర్మ బ్రహ్మైవాహ మితి నిశ్చయాత్మక జ్ఞానేన నశ్యతి ।

తా : సంచిత కర్మము నేనే బ్రహ్మ మను నిశ్చయాత్మక జ్ఞానముచే నశించును.

మూ : ఆగామి కర్మాపి జ్ఞానేన నశ్యతి ।

తా : ఆగామి కర్మము కూడ జ్ఞానము చేత నశించును.

మూ : కించ యే జ్ఞానినం స్తువంతి భజం త్యర్చయంతి తాన్

ప్రతి జ్ఞానికృత మాగామి పుణ్యం గచ్ఛతి ।

తా : మఱియు బ్రహ్మజ్ఞాని నెవరు స్తుతింతురో, యెవరు భజింతురో, యెవరు పూజింతురో వారి కాజ్ఞాని చేసిన యాగామి పుణ్యము వచ్చును.

మూ : యే జ్ఞానినం నిందంతి ద్విషంతి దుఃఖ ప్రదానం కుర్వంతి తాన్ ప్రతి జ్ఞాని కృతం సర్వ మాగామి క్రియమాణం యదవాచ్యం కర్మ పాపాత్మకం తద్గచ్ఛతి ।

తా : ఎవరు జ్ఞానిని నిందింతురో, యెవరు ద్వేషింతురో, యెవరు

దుఃఖపెట్టుదురో వారికా జ్ఞాని చేసిన చేయుచున్న చెప్పరాని పాపకర్మము లన్నియుఁ జేరును.

ఇక్కడ నొక్క విషయమును గమనింపవలెను. బ్రహ్మ జ్ఞాని యుద్దేశ పూర్వకముగా నేపుణ్య పాపకర్మములను నాచరింపఁడు గావున వానికా ఫలితములంటవు. మఱేమనఁగా నట్టి బ్రహ్మ జ్ఞానిని ద్వేషించు వారి కతఁడు చేసిన పాపము, పూజించు వారి కతఁడు చేసిన పుణ్యము లభించు నని భావము.

మూ : తథా చాత్మవిత్ సంసారం తీర్త్వా బ్రహ్మానంద మిహైవ ప్రాప్నోతి ।

తా : ఈ విధముగా నాత్మవేత్త సంసారమును దాఁటి యీ లోకము నందే బ్రహ్మానందము నొందును.

మూ : తరతి శోక మాత్మవి దితి శ్రుతేః ।

తా : ఆత్మవేత్త శోకమును దరించుచున్నాడని వేద ముపదేశించుచున్నది.

శ్లో॥ తనుం త్యజతు వా కాశ్యాం శ్వపచస్య గృహేథవా ।
జ్ఞాన సంప్రాప్తి సమయే ముక్తో సౌ విగతాశయః ॥
ఇతి స్మృతేశ్చ ॥

తా : ఆత్మ జ్ఞానము ప్రాప్తించిన సమయమందే జీవన్ముక్తుఁడగు వాడు తన దేహమును గాశిలో విడిచినను, చండాలునింటిలో విడిచినను విగతాశయుడు (ఏ యాశయములు లేనివాఁడు) గావున నిత్యముక్తుడగు చున్నాఁడని ధర్మ శాస్త్రములు వక్కాణించుచున్నవి.

ఇది శ్రీమచ్ఛంకరాచార్య విరచితమగు తత్త్వబోధ యను వేదాంతప్రకరణ ముగిసినది.

శ్రీ మత్పరమేశ్వరార్పణ మస్తు.